క్లుప్తంగా

విద్యార్థిని ప్రతిభ


కర్రు రసజ్ఞ

దుగ్గొండి : మండలంలోని జీడికల్‌కు చెందిన కర్రు రసజ్ఞ ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాల్లో ప్రతిభ చాటింది. ఎంపీసీ విభాగంలో 470కి గాను 469 మార్కులు సాధించి స్టేట్ టాపర్‌గా నిలిచింది. తొలుత ఆమె 453 మార్కులు సాధించగా ఇంప్రూవ్‌మెంట్ పరీక్ష రాసి 469 మార్కులు సాధించింది. రసజ్ఞను తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

విద్యార్థులకు అభినందన



నర్సంపేట : ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన పట్టణంలోని కాకతీయ కళాశాల విద్యార్థులను డైరెక్టర్ సృజనరెడ్డి సోమవారం అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఎంపీసీలో చీకటి దివ్య ప్రసన్న, సమ్రీన్ 467 చొప్పున, షాజియా 466, బీపీసీలో జన్ను శివాని 434 మార్కులు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవ రెడ్డి, ఏఓ వీరారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



దుగ్గొండి : మండలంలోని పొనకల్‌కు చెందిన కొత్తకొండ రవివర్మకు అతడు నెల రోజుల క్రితం లక్ష్మీపురంలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఎస్సై రావుల రణధీర్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం అప్పగించాడు. రవివర్మ సెల్‌ఫోన్ పోగొట్టుకుని వివరాలను సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయగా పోలీసులు దర్యాప్తు చేపట్టి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రవివర్మకు అప్పగించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని ధర్మతండాకు చెందిన బోడ రమేశ్‌కు రూ.18 వేల, భూక్య అరుణకు రూ.41వేల 500ల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు భూక్య భాస్కర్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ సోమవారం పంపిణీ చేశారు. అనంతరం భాస్కర్, శంకర్ మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అనుబంధ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు బోడ రవి, నాయకులు భూక్య రాజు, బోడ ప్రవీణ్, బోడ శ్రీనివాస్, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవం



వర్ధన్నపేట : పట్టణంలోని బృందావనం గోశాలలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకటరమణ సోమవారం హరిత హారం కార్యక్రమం నిర్వహించారు. మొక్కలు నాటారు. కార్యక్రమంలో గోశాల నిర్వాహకుడు మల్లెపాక అనిల్, బీజేపీ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు ఎడ్ల అశోక్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్యదర్శికి గాయాలు

సంగెం : రోడ్డు ప్రమాదంలో మండలంలోని షాపూర్ పంచాయతీ కార్యదర్శి రమ్య, మల్టీపర్పస్ వర్కర్ పేరాల సురేందర్‌రావులకు తీవ్ర గాయాలయ్యాయని ఎంపీడీఓ రవీందర్ తెలిపారు. ఇద్దరూ షాపూర్ శివారు భాగ్యనగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల ఫొటోలు తీసుకుని రోడ్డు దాటుతుండగా పర్వతగిరి మండలానికి చెందిన వ్యక్తి ద్విచక్ర వాహనంతో ఢీకొట్టాడు. ఇద్దరికీ కాళ్లు విరిగాయి. క్షతగాత్రులను ఆస్పత్రిలో చేర్పించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాడి కేసులో ముగ్గురి అరెస్ట్

నర్సంపేట : దాడి కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్టు చెన్నారావుపేట ఎస్సై రాజేశ్‌రెడ్డి తెలిపారు. వివరాలిలా.. చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లికి చెందిన వట్టె సంపత్‌రెడ్డికి, పెండ్లి కొమురయ్యకు మధ్య భూవివాదం ఉంది. ఈ క్రమంలో మే 17న కొమురయ్యతోపాటు అతని కుమారులు సుధాకర్, ప్రభాకర్ కలిసి వట్టె సంపత్‌రెడ్డితోపాటు అతని కుమారుడు మధుకర్‌రెడ్డిపై దాడి చేశారు. సంపత్‌రెడ్డి, మధుకర్‌రెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయి. సంపత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కొమురయ్య, సుధాకర్, ప్రభాకర్‌లపై కేసు నమోదు చేశారు.

‘ఏఎన్‌ఎం’ ఖాళీలతో వెతలు

- గర్భిణులు, బాలింతలకు తప్పని తిప్పలు
- శిక్షణ కాలంలో సబ్‌సెంటర్లకు తాళం..!

నర్సంపేట రూరల్ : మండలంలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు, పల్లె దవాఖానాల్లో ఏఎన్‌ఎంలు పోస్టులు ఖాళీగా ఉండడంతో రోగులకు తిప్పలు తప్పడం లేదు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు టీకాలు వేయాలన్నా ఇబ్బందులు నెలకొన్నాయి. రోగులకు బీపీ, షుగర్ వంటి పరీక్షలు సైతం నిర్వహించలేని పరిస్థితి చోటు చేసుకుంది. ఏఎన్‌ఎంలు శిక్షణకు వెళ్లినప్పుడు, ఇతర పలు సందర్భాల్లో సబ్‌సెంటర్లకు తాళం వేసి ఉంటున్న దుస్థితి నెలకొంది.

నర్సంపేట మండలంలోని భాంజీపేట ఆరోగ్య కేంద్ర పరిధిలో పట్టణంలోని 24 వార్డులతోపాటు మండలంలోని 21 గ్రామపంచాయతీలు, శివారు గ్రామాలున్నాయి. సుమారు 80 వేలకుపైగా జనాభా ఉన్నట్టు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఆరోగ్య కేంద్ర పరిధిలో 12 సబ్‌సెంటర్లున్నాయి. వీటిలో మొత్తం 24 మంది ఏఎన్‌ఎంలు ఉండగా ఏడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మాధన్నపేట, కమ్మపల్లి, నర్సంపేట–3 మొదటి ఏఎన్‌ఎం, మహేశ్వరం, కమలాపురం, ఆకులతండా సబ్‌సెంటర్లలో సెకండ్ ఏఎన్‌ఎం పోస్టులు కొన్నేళ్లుగా ఖాళీ ఉన్నాయి. కొన్ని చోట్ల డిప్యూటేషన్‌పై ఏఎన్‌ఎంలను నియమించారు.


మాధన్నపేట సబ్‌సెంటర్

సకాలంలో అందని వైద్యసేవలు

గ్రామస్థాయిలో సర్వేలు నిర్వహించడంతోపాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు టీకాలు, తదితర సేవలు సకాలంలో అందడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మేజర్ గ్రామాలతోపాటు శివారు పల్లెలు, తండాలకు గతంలో ఇద్దరు ఏఎన్‌ఎంలు సేవలు అందించగా ప్రస్తుతం ఒక్కరే ఉండడంతో రోగులు ప్రయివేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. మహేశ్వరం సబ్‌సెంటర్‌లో మొదటి, రెండో ఏఎన్‌ఎం పోస్టులో నియామకం చేపట్టకపోవడంతో నర్సంపేట సబ్‌సెంటర్ నుంచి సెకండ్ ఏఎన్‌ఎంను పంపించి సేవలు అందిస్తున్నారు.

సర్దుబాటు చేస్తున్నాం

మొదటి, రెండో ఏఎన్‌ఎం ఖాళీల్లో తాత్కాలికంగా సర్దుబాటు చేసి రోగులకు సేవలు అందిస్తున్నాం. ఖాళీలపై ప్రభుత్వానికి నివేదిక పంపించాము. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సేవలు అందేలా చర్యలు చేపడుతున్నాం.
– డాక్టర్ అరుణ్‌చంద్ర, వైద్యాధికారి, భాంజీపేట

బీజేపీ పాలనలోనే సమగ్రాభివృద్ధి

- పాలకుర్తి అసెంబ్లీ కన్వీనర్ శ్రీమాన్

రాయపర్తి : బీజేపీ పాలనలోనే దేశం, రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధిస్తున్నట్టు ఆ పార్టీ పాలకుర్తి అసెంబ్లీ కన్వీనర్ పూసల శ్రీమాన్ తెలిపారు. మండల కేంద్రంలో ఆ పార్టీ 11 ఏళ్ల పాలనపై సోమవారం నిర్వహించిన సమావేశానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధికి పాటుపడుతోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలను, సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించి పార్టీని మండలంలో బలోపేతం చేయాలని శ్రేణులకు సూచించారు. ప్రజాసంక్షేమమే ధ్యేయం కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందని తెలిపారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు నూనె అనిల్, నాయకులు మందపురి రాజు, బూర్గు నవీన్, పెండ్యాల గణేశ్, రాజశేఖర్, సురేశ్, నరేశ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీమాన్

అక్షరాభ్యాసం



రాయపర్తి : మండలంలోని కొత్తతండా ప్రభుత్వ ప్రైమరీ స్కూల్‌లో విద్యార్థులతో సోమవారం సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అలాగే పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం పాక పద్మావతి మాట్లాడారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెహనా బేగం, తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల రక్షణకు కృషి చేయాలి


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తిరుమల, తదితరులు

- సఖి సెంటర్ కేస్ వర్కర్ తిరుమల

నల్లబెల్లి : సమాజంలోని ప్రతిఒక్కరూ బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి సఖి సెంటర్ కేస్ వర్కర్ తిరుమల కోరారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మదర్ తెరిస్సా మండల సమాఖ్య కార్యాలయంలో గ్రామైఖ్య సంఘం సభ్యులకు సోమవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సఖి సెంటర్ ద్వారా అందుతున్న సేవలను వివరించారు. బాలల, మహిళల హక్కులు, రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలు 181, వృద్ధులు 14567, బాలలు 1098, 100 హెల్ప్‌లైన్ నంబర్లకు ఫోన్ చేసి రక్షణ పొందాలని సూచించారు. అనంతరం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చైల్డ్ లైన్ కేస్ వర్కర్ స్వప్న, సీసీ పద్మ, వీఓఏ రవీందర్, ప్రసాద్, చైల్డ్‌లైన్ టీమ్ సభ్యులు సుష్మ, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

పర్వతగిరి : మండలంలోని ఇస్లావత్‌తండాలో విద్యుత్ శాఖ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఏడీఈ)తిరుపతినాయక్ ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. తండాలో సిబ్బంది విద్యుత్ స్తంభాలను అమర్చారు. ఈ సందర్భంగా ఏడీఈ తిరుపతినాయక్ మాట్లాడారు. స్కూల్, వీధి దీపాల కోసం నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్టు తెలపిఆరు.

వైద్యశిబిరం

పర్వతగిరి : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల స్కూల్/కళాశాలలో సోమవారం డాక్టర్ జ్యోత్స్నరాణి, యోగా టీచర్ రామకృష్ణ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జ్యోత్స్నరాణి విద్యార్థినులకు పీసీఓడి, పీసీఓఎస్ ఇబ్బందుల నివారణ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. యోగా టీచర్ రామకృష్ణ ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం అవసరమైన యోగాసనాల గురించి వివరించారు.

‘అంబేడ్కర్’ డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్

నర్సంపేట : డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2025–26 విద్యాసంవత్సరంలో డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లం నవీన్ తెలిపారు. ప్రవేశాల నోటిఫికేషన్ పత్రాలను కళాశాలలోని తన చాంబర్‌లో సోమవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఆయా కోర్సుల్లో చేరడానికి ఆగస్టు 13 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. యూనివర్సిటీ తక్కువ ఫీజుతో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తోందని చెప్పారు. అర్హులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కోఆర్డినేటర్ డాక్టర్ పూర్ణచందర్ మాట్లాడుతూ ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు కళాశాలలోని లర్నర్ సపోర్ట్ సెంటర్‌ను ఎంచుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 7382929577లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది కె.నరేశ్, బి.శివ తదితరులు పాల్గొన్నారు.


నోటిఫికేషన్ పత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్

స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు రేపు ఎంపిక పోటీలు

ఖానాపురం/నెక్కొండ : రాష్ట్రంలోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లోని స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రస్తుత విద్యాసంవత్సరంలో 4వ తరగతిలో ప్రవేశాల కోసం రేపు (18న) అశోక్‌నగర్‌లోని సైనిక్ స్కూల్‌లో, నెక్కొండలో మండల స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్టు ఎంఈఓలు శ్రీదేవి, రత్నమాల సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. సెప్టెంబర్ 1, 2016 నుంచి ఆగస్టు 31 2017 మధ్య జన్మించిన బాలబాలికలు అర్హులని తెలిపారు. తొమ్మిది అంశాల్లో శారీరక సామర్థ్యానికి సంబంధించిన పోటీలుంటాయని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలుంటాయని వివరించారు.

ఆర్థికసాయం

గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తికి చెందిన బోయిని నర్సయ్య, కొనాయమాకులలో హఫీజ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి రూ.5 వేల చొప్పున సాయం అందజేశారు. ఆయన పంపించిన నగదును బాధిత కుటుంబాలకు స్థానిక నాయకులు అల్లం మర్రెడ్డి, వీరగోని రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. కార్యక్రమాల్లో నాయకులు బొడిగె శోభన్, తిప్పారపు రవీందర్, ఇంద్రసేనారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాల్యమిత్రుల..

నెక్కొండ : మండలంలోని అప్పల్‌రావుపేటకు చెందిన రావుల అశోక్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి అతడి పదో తరగతి నాటి మిత్రులు సోమవారం రూ.40 వేల సాయం అందజేశారు. తొలుత అశోక్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అశోక్ మిత్రులు కందిక చెన్నకేశవులు, పాకలపాటి రవిబాబు, కొయ్యడి శ్రీనివాస్, కుడికాల ప్రదీప్, బొమ్మరబోయిన రమేశ్, తురాయి రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు..

వర్ధన్నపేట : మండలంలోని ల్యాబర్తికి చెందిన ఎంఎల్‌టీ పూర్తి చేసిన తాటికాయల అరుంధతికి ఫీజు కోసం మహా అది సేవ సంస్థ సభ్యుడు డాక్టర్ సినపెల్లి విజయ్‌కుమార్ సోమవారం రూ.7 వేల సాయం అందించారు. అలాగే ఖమ్మం జిల్లా వెంకటాయపాలెంకు చెందిన కాకతీయ మెడికల్ కళాశాల వైద్యవిద్యార్థి సాయికిరణ్‌కు ఫీజు కోసం రూ.3 వేలు అందించారు. అనంతరం విజయ్‌కుమార్ మాట్లాడారు. విద్యార్థులకు సాయం అందించేందుకు దాతలు ముందుకు రావాల న్నారు. పేద విద్యార్థులు సాయం కోసం సెల్ నంబర్ 9010730380ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో మాస్ బాధ్యులు విజయ్‌కుమార్, రాజ్‌మోహన్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి

దుగ్గొండి : రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించేందుకు చట్టబద్ధత కల్పించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని బిక్కాజిపల్లిలో రైతుల హక్కులు, బాధ్యతలపై రూపొందించిన షార్ట్ ఫిలింను సోమవారం సాయంత్రం ప్రదర్శించగా ఆయన మాట్లాడారు. రైతులకు ఉన్న హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని విమర్శించారు. రైతులు ఉద్యమాలకు సన్నద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, మండల అధ్యక్షుడు లడె మోహన్‌రావు, విజేందర్, గుండెకారి మల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

నర్సంపేట : బీజేపీ నర్సంపేట రూరల్ మండల అధ్యక్షుడు తనుగుల అంబేడ్కర్ ఇటీవల ప్రమాదంలో గాయపడగా ఆయన్ను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ సోమవారం పరామర్శించారు. అండగా ఉంటామని అంబేడ్కర్‌కు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వడ్డేపల్లి నర్సింహరాములు, జిల్లా ఉపాధ్యక్షుడు రేసు శ్రీనివాస్, నాయకులు గడల కుమార్, కట్ల రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేటలో..

వర్ధన్నపేట : పట్టణానికి చెందిన పసునూరి వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల సంస్థ మాజీ డైరెక్టర్ ఈగ మల్లేశం సోమవారం పరామర్శించారు. తొలుత మృతుడి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పెద్దూరి సంజీవరావు, మార్త సారంగపాణి, పెద్దూరి రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎంసీపీఐ(యూ) నాయకుడి మృతి

నర్సంపేట : పట్టణంలోని జ్యోతిబసు నగర్‌కు చెందిన ఎంసీపీఐ(యూ) డివిజన్ కమిటీ సభ్యుడు, పట్టణ నాయకుడు కుక్కల యాకయ్య (54) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతదేహానికి ఆ పార్టీ యాకయ్య నాయకులు ఎర్ర జెండా కప్పి పూలపూల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యాకయ్య సేవలను పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ కొనియాడారు. ప్రజాసమస్యల పరిష్కారానికి యాకయ్య ఎనలేని పోరాటాలు నిర్మించారని చెప్పారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కుసుంబ బాబురావు, వంగల రాగసుధ, యూపీఎస్‌ఎం రాష్ట్ర కార్యదర్శి కన్నం వెంకన్న, డివిజన్ కార్యదర్శి రాజా సాహెబ్, సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, జిల్లా కమిటీ సభ్యుడు కేశెట్టి సదానందం, ఏఐసీటీయూ జిల్లా అధ్యక్షుడు మాషుక్, తదితరులు నివాళులర్పించారు.

గ్రామసంఘాల బాధ్యులకు శిక్షణ


గ్రామ సంఘాల ప్రతినిధులకు శిక్షణ ఇస్తున్న సీఆర్‌పీ

దుగ్గొండి : మండల కేంద్రంలోని ప్రశాంతి మండల సమాఖ్య కార్యాలయంలో గ్రామ సంఘాల బాధ్యులకు సోమవారం శిక్షణా శిబిరం నిర్వహించారు. గ్రామ సంఘం నిర్వహణ, చిన్న సంఘాల పర్యవేక్షణ, గ్రామ సంఘం నిధులు, విధులపై సీఆర్‌పీలు రజిత, సౌందర్య వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం గుజ్జుల రాజ్‌కుమార్, సమాఖ్య అధ్యక్షురాలు ఇనుముల సరిత, కార్యదర్శి ఓరుగంటి హిమరాణి, కోశాధికారి ఎద్దు జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


వర్ధన్నపేట : మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు


సంగెం : మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

- ఎమ్మెల్యేలు నాగరాజు, ప్రకాశ్‌రెడ్డి

వర్ధన్నపేట/సంగెం/గీసుకొండ/నల్లబెల్లి/రాయపర్తి: రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని వర్ధన్నపేట, పరకాల ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి తెలిపారు. జిల్లాలోని వర్ధన్నపేట, సంగెం, గీసుకొండ, నల్లబెల్లి, రాయపర్తి మండలాల్లోని రైతు వేదికల్లో నిర్వహించిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట మండలంలోని ఇల్లందలో ఎమ్మెల్యే నాగరాజు, సంగెం మండలంలోని మొండ్రాయిలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడారు. రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రైతులు శాస్త్రవేత్తలతో ప్రత్యక్షంగా వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన ఆవిష్కరణలు, సాగు అనుభవాలను తెలుసుకునే వెసులుబాటు కలుగుతోందని చెప్పారు. ప్రభుత్వం వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే రూ.78 వేల కోట్లు రైతు సంక్షేమానికి ఖర్చు చేసినట్టు వివరించారు. కార్యక్రమాల్లో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, కలెక్టర్ సత్యశారద, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, భూగర్భ జలవనరుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ అశోక్, సీపీఓ రాజన్, తహసీల్దార్లు కృష్ణ, రాజ్‌కుమార్, ఎంపీడీఓలు రవీందర్, నర్సింహమూర్తి, ప్రత్యేక అధికారి రమేశ్, ఏఓలు బన్న రజిత, యాకయ్య, కృష్ణారెడ్డి, హరిప్రసాద్ బాబు, తదితరులు పాల్గొన్నారు.


గీసుకొండ : వీక్షిస్తున్న మేయర్ సుధారాణి

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు


నర్సంపేట : ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను ప్రారంభిస్తున్న టీపీసీసీ సభ్యుడు రామానంద్

- టీపీసీసీ సభ్యులు రామానంద్, రంజిత్‌రెడ్డి

నర్సంపేట/నెక్కొండ/పర్వతగిరి/రాయపర్తి : అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, పర్వతగిరి ఎంపీడీఓ శంకర్ నాయక్ తెలిపారు. లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాల భూమి పూజ, ప్రారంభాలకు నర్సంపేటలో రామానంద్, నెక్కొండలో సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, పర్వతగిరిలో ఎంపీడీఓ శంకర్‌నాయక్ , రాయపర్తి మండలంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదుల కంటి రవీందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. మొదటి విడతలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు సత్వరమే నిర్మాణాలు చేపట్టి సకాలంలో పూర్తి చేసుకోవాలని సూచించారు. మిగతా అర్హులకు దశలవారీగా ఇళ్లు మంజూరవుతాయని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. కార్యక్రమాల్లో నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మధుకర్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తుమ్మలపల్లి సందీప్ తదితరులు పాల్గొన్నారు.


నెక్కొండ : మంజూరు పత్రం ఇస్తున్న రంజిత్‌రెడ్డి


పర్వతగిరి : మంజూరు పత్రం ఇస్తున్న ఎంపీడీఓ

‘స్థానిక’ ఎన్నికల్లో గెలుపే ధ్యేయం

- క్లస్టర్ కోఆర్డినేటర్ మురళి

రాయపర్తి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని ఆ పార్టీ పెర్కవేడు ఎంపీటీసీ క్లస్టర్ కోఆర్డినేటర్ ఎనగందుల మురళి కోరారు. మండలంలోని పెర్కవేడులో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని చెప్పారు. సమావేశంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తీగల సాయిలు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పుల్లూరు దామోదర్, నాయకులు సుతారి యాదగిరి, బండి కుమార్, వెంకటాచారి, అబ్బోజు సేనాపతి, దురిశెట్టి రమేశ్, పరీదుల బాబు, దొనగాని నారాయణ, వేల్పుల యాకయ్య, బాబు, రజనీకాంత్, సల్ల కొమురయ్య, ఊగ ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మురళి

19న మంద కృష్ణకు సన్మానం

వర్ధన్నపేట : ఈనెల 19న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) అధ్వర్యంలో పద్మశ్రీ మంద కృష్ణను సన్మానిస్తామని సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం కాసీమ్, ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సందె కార్తీక్ తెలిపారు. పట్టణంలో నియోజకవర్గ నాయకుడు అమ్మిరాజు స్వామి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఎస్‌ఎఫ్, వీహెచ్‌పీఎస్ ముఖ్యనాయకుల సమావేశానికి కాసీమ్, కార్తీక్ హాజరై మాట్లాడారు. మంద కృష్ణ ఇటీవల పద్మశ్రీ అవార్డు అందుకున్న సందర్భంగా సన్మానించడానికి నిర్ణయించినట్లు తెలిపారు. వికలాంగుల పెన్షన్ పెంపు, ఇతర పలు సమస్యలపై కృష్ణ పోరాడినట్టు తెలిపారు. సన్మానానికి వికలాంగులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్, ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి మాసాని గోపాల్, నాయకులు గోలి సుధాకర్, ఐత రాజు, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

పంట ధ్వంసంపై ఫిర్యాదు

నల్లబెల్లి : మండలంలోని అర్వయ్యపల్లికి చెందిన జాటోత్ పడ్తీనాయక్ తన గోరుచిక్కుడు పంటను గ్రామానికి చెందిన గుండారపు నాగరాజు ట్రాక్టర్‌తో ధ్వంసం చేశాడని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పడ్తీనాయక్ వివరాలు వెల్లడించారు. నాగరాజుకు చెందిన భూమిని తాను కౌలుకు తీసుకొని ఎకరం భూమిలో పంటను సాగు చేయగా గోరుచిక్కుడు కాయలను కౌలు విషయం తనతో చర్చించకుండానే నాగరాజు ఆదివారం రాత్రి ధ్వంసం చేశాడని వాపోయారు.

బోనస్ డబ్బులు జమ చేయాలి

సంగెం: సన్న ధాన్యం బోనస్ డబ్బులు రైతుల అకౌంట్లలో జమ చేయాలని ఏఐకేఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఇస్మాయల్ డిమాండ్ చేశారు. మండలంలోని కుంటపల్లిలో రౌతు శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బోనస్‌తోపాటు రవాణా చార్జీలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.